క్లుప్తంగా

నేటి నుంచి 'పల్లె పండుగ'

కడియం: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి వివిధ గ్రామాల్లో రూ.1.21 కోట్లతో 12 పనులకు ప్రారంభోత్సవం చేపట్టనున్నట్లు ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. వీరవరం, పొట్టిలంక, దామిరెడ్డిపల్లి, జేగురుపాడు గ్రామాల్లో మంగళవారం పనులు ప్రారంభిస్తారన్నారు. 17వ కడియపులంక, మురమండ, 20న వేమగిరి, కడియం గ్రామాల్లో జరుగుతాయని వివరించారు.

నేడు డీసీసీ సర్వసభ్య సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా పరిశీలకులు కొలనుకొండ శివాజీ హాజరవుతారన్నారు. శాసన సభకు పోటీ చేసిన అభ్యర్థులు తమ నియోజకవర్గాల పరిధిలో పట్టణ, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల పేర్లతో పాటు 11 మంది సభ్యులు ఉండేలా కమిటీ తయారు చేసుకుని తీసుకురావాలన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

17 నుంచి క్రీడాకారుల ఎంపికలు

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 17 నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కేవీ స్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఎస్‌కేవీటీ పాఠశాలలో ఈ నెల 17న బాలురు, బాలికల విభాగంలో అండర్ 14 ఫుట్ బాల్, అథ్లెటిక్స్ పోటీలు, అలాగే ఈ నెల 24, 25న అండర్ 17 బాలికల విభాగంలో ఆర్ట్స్ కళాశాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ 14, 17 బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్ పోటీలు ఈ నెల 29న అనపర్తి జెడ్పీహెచ్ పాఠశాలలో జరుగుతాయన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కొంతమూరు హైస్కూల్ హెచ్‌ఎం రత్నకళ

రాజమహేంద్రవరం రూరల్: పాండిచ్చేరిలో ఇటీవల జరిగిన 31వ సబ్ జూనియర్ అట్యా-పాట్యా జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులుర్థులు ఎం.ఆనంద్ కుమార్, జి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం వారిని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.రత్నకళ అభినందించారు. అలాగే ఫిజికల్ డైరెక్టర్ టి.సుజాతలకు అభినందనలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు సర్పంచ్ గౌరవ వేతనం



కలెక్టర్ ప్రశాంతికి చెక్కు అందజేస్తున్న దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య తదితరులు

కడియం: దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య తన 36 నెలల గౌరవ వేతనం రూ.1,0,8000 చెక్కును కలెక్టర్ పి. ప్రశాంతికి సోమవారం అందజేశారు. ఇటీవల వరదల కారణంగా నష్టపోయిన ప్రజానీకానికి సాయపడాలన్న ఆలోచనతో సీఎం రిలీఫ్‌ఫండ్‌కు ఈ మొత్తాన్ని అందజేయాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో దుళ్ల చేనేత నాయకులు నూలు బాలకోటయ్య, బూడిద బ్రహ్మం, గుత్తి సత్యనారాయణ, కాలెపు వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు

సీతానగరం: పురుషోత్తపట్నానికి చెందిన పనమాల చిన్నబాబుపై అతడి భార్య లక్ష్మీ దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ చిన్నబాబుకు విజయవాడకు చెందిన లక్ష్మీదుర్గతో వివాహమైందని, వారికి ఇద్దరు కుమారులున్నారన్నారు. అయితే చిన్నబాబు కొద్దికాలంగా భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అప్పు తీర్చమన్నందుకు దాడి

సీటీఆర్ఐ: అప్పు తీర్చమన్నందుకు తనపై, తన తండ్రి నాగరాజుపై దాడి చేశారని యాంకర్ కావ్యశ్రీ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం రాజమండ్రి పార్లమెంట్ తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియతో కలిసి విలేరులతో మాట్లాడారు. తాను అభిలాష్ అనే వ్యక్తికి మూడేళ్ల క్రితం అప్పు ఇచ్చానన్నారు. దాని తీర్చమని అడిగితే అభిలాష్ తండ్రి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఎస్వీ శ్రీను దాడి చేశారన్నారు. ఆయన మాజీ ఎంపీ భరత్ రామ్ అనుచరుడు అని ఆరోపించారు.

అల్పపీడనంతో ఆందోళన

- పూతదశలో వరిపైరు
- భారీ వర్షాలు కురిస్తే దిగుబడిపై ప్రభావం
- అన్నదాతల ఆవేదన



కడియం మండలంలో ఆరోగ్యంగా ఉన్న వరిపైరు

కడియం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నెల 16 నుంచి 18 వరకూ కోస్తాంధ్రాలో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో గుబులు నెలకొంది. రూరల్ నియోజక వర్గంలో సుమారు ఐదువేల హెక్టార్లకు పైగా వరిసాగు జరుగుతోంది. కడియం మండలంలో 2,623 హెక్టార్లలో రైతులు పండిస్తున్నారు. దీనిలో సుమారు 70 శాతానికి పైగా ఎంటీయూ 7029 (స్వర్ణ) రకం వరినే ఎక్కువగా వేశారు. దిగుబడి బాగుండడం, తెగుళ్లను తట్టుకోవడంతో ఇతర సాధారణ రకాల కంటే మెరుగైన ఫలితాలు కనిపించడంతో దీనిపైనే అధికంగా ఆధారపడుతున్నారు. వీటితో పాటు ఎంటీయూ 1318, బీపీటీ, 126 రకాలను కూడా పలువురు రైతులు సాగు చేస్తున్నారు.

ఈదురు గాలులతో ఇబ్బంది

అత్యధికంగా సాగు చేస్తున్న స్వర్ణ రకం వర్షాలకు కూడా తట్టుకునే శక్తి ఉన్నప్పటికీ ఈదురు గాలులు వీస్తే మాత్రం వరికంకులు నేలనంటే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఒక మోస్తరు వర్షాలతో ఈ అల్పపీడనం దాటిపోతే పర్వాలేదని, అలా కాకుంటే మాత్రం దిగుబడి నష్టాలను ఎదుర్కొవాల్సి వస్తుందన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. గాలుల ప్రభావం ఉంటే స్వర్ణ రకం వరితో ఇబ్బందేనని భయపడుతున్నారు.

పూత దశలోనే అధికం

ప్రస్తుతం వరి పంట పూతదశలో ఉందని వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. మరో 10 నుంచి 15 రోజుల్లో గింజలు పాలుపోసుకునే దశకు చేరతాయంటున్నారు. ప్రస్తుతం పూత దశలో భారీ వర్షాలు కురిస్తే దిగుబడి తగ్గుతుందని భావిస్తున్నారు. ఒక మోస్తరు వర్షాలతో గట్టెక్కితే దిగుబడికి ఇబ్బంది ఉండదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా వరిపంట ఆరోగ్యంగానే ఉందని చెబుతున్నారు.

అనేక సమస్యలు

పంటల సాగుకు రైతులు ప్రకృతితో పాటు, స్థానిక పరిస్థితులతో కూడా పోటీపడాల్సి వస్తోంది. సీజనల్‌లో వర్షాల రాకను ఎవ్వరూ కాదనలేరు. కానీ అలా కురిసిన వర్షపు నీటి కారణంగా పంటలు ముంపు బారిన పడుతుండడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, మురమండ, మాధవరాయుడుపాలెం, దుళ్ల తదితర గ్రామాల్లో వరి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఆయా పంట పొలాలకు సాగు/మురుగు నీరు పారే కాలువల నిర్వహణా లోపాల కారణంగా ప్రస్తుతం అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. దీంతో సమయానికి సాగునీరు అందక, ముంపు వస్తే దిగువకు నీరు పారక రైతాంగం ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ప్రకృతితో పోరాడుతూ సాగు చేయగలుగుతున్నాం గానీ, స్థానికంగా సాగు / మురుగునీటి వసతులు మెరుగుపడక ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. తుపానులు, భారీ వర్షాలు వస్తున్నాయంటే రైతుల్లో భయాందోళనలు నెలకొనడానికి ఈ పరిస్థితులు కూడా ఒక కారణంగా చెబుతున్నారు.

భారీ వర్షాలతో ఇబ్బందే

ప్రస్తుతం గింజలు పాలుపోసుకోవడానికి తగిన విధంగా వరిపైరు ఉంది. ఇప్పుడు గనుక భారీ వర్షాలు కురిస్తే దిగుబడి బాగా పడిపోతుంది. ఒక మోస్తరు వర్షంతో గట్టెక్కితే రైతులకు ఇబ్బందులు తప్పుతాయి.

– టి.కొండయ్య, రైతు, దుళ్ల

ముంపునీటితో నష్టాలు

తుపానులు, వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే ముంపునీరు సక్రమంగా దిగువకు పోయే మార్గాలుంటే రైతులకు భారీ నష్టాలు కలుగకుండా ఉంటాయి. రోజుల తరబడి ముంపునీరు ముందుకు కదలకపోతే మాత్రం నష్టాలు తప్పవు. గతంలో కూడా ఇదే పరిస్థితులను రైతులు ఎదుర్కొన్నారు.

– ఎం.నారాయణ, రైతు, మురమండ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నగర పాలక సంస్థ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కార్పొరేషన్‌డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై నగర ప్రజలు అర్జీలు అందజేశారు. వెంకటరమణ మాట్లాడుతూ ప్రజల నుంచి 19 అర్జీలను స్వీకరించామని, వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ఎస్.కోటయ్య, ఎస్ఈ జి.పాండురంగారావు, మేనేజర్ అబ్దుల్ మాలిక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్ షా అలీ, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మ్యాజిక్ బస్ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: ప్రతిరోజూ చేతులను శుభ్రం చేసుకుని ఆహారం తింటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రత్నకళ అన్నారు. కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రత్నకళ మాట్లాడుతూ పాఠశాలలో 7, 8, 9వ తరగతి పిల్లలకు న్యూట్రీషన్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ పర్సనల్ హైజీన్‌పై అవగాహన కల్పిస్తున్న మ్యాజిక్ బస్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ స్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పిడింగొయ్యి, శాటిలైట్‌సిటీ, హుకుంపేట డి బ్లాకులో సోమవారం జరిగిన పల్లె పండుగ– పంచాయతీ వారోత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ పల్లెల్లో అభివృద్ధి పండగ మొదలైందన్నారు. పిడింగొయ్యిలో రూ.3.30 కోట్లు, శాటిలైట్ సిటీలో రూ.1.50 కోట్లు, హుకుంపేటలో రూ.96 లక్షలతో పనులను ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మార్ని వాసుదేవ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, మాజీ సర్పంచ్ దుద్దుపూడి రామకృష్ణ, బొప్పన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏబీఎన్ పార్కులో సౌకర్యాలు మెరుగుపరచాలి

సీటీఆర్ఐ: నగరంలోని అన్ని పార్కుల్లో సందర్శకుల అవసరార్థం సౌకర్యాలను మెరుగుపరచాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. 39వ డివిజన్ ఆర్యాపురంలోని ఏబీ నాగేశ్వరరావు పార్కును స్థానిక నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పార్కు చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తీయించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పార్కు చుట్టూ అవసరమైన చోట హైమాక్స్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, నిత్యం పారిశుద్ధ్యం, మరుగు దొడ్ల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. మంచి నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, చెత్తా చెదారం లేకుండా చూడాలని, అందుకు కావాల్సిన పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు రాత్రి సమయాల్లో పార్కు గోడలు దూకి లోపలికి ప్రవేశిస్తున్న నేపథ్యంలో పోలీసులు నిత్యం గస్తీ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పార్కును శుభ్రంగా ఉంచేందుకు కావాల్సిన అన్ని చర్యలు చేపట్టి పార్కునకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ దారిలో ప్రయాణమంటే భయమే..



వైటీసీకి వెళ్లే రోడ్డులో ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

- అధ్వానంగా వైటీసీ, డైట్ కళాశాల రహదారి
- తుప్పల్లో పాముల సంచారం



వైటీసీలో గదిలోకి వెళుతున్న పాము

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని వైటీసీ, డైట్ కళాశాలకు వెళ్లే రోడ్డులో రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఈ రోడ్డులో రూరల్ తహసీల్దార్ కార్యాలయంతో పాటు సుమారు పదికిపై ప్రభుత్వ ఆఫీసులు ఉన్నాయి. ఈ సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. వాటిలో విష సర్పాలు సంచరిస్తున్నాయి. పగటి సమయంలో అవి కనబడతాయి కాబట్టి జాగ్రత్త పడే అవకాశం ఉంది. కానీ రాత్రి సమయంలో ఈ రోడ్డులో సరైన వీధి దీపాలు కూడా లేకపోవడంతో విష సర్పాలు కనిపించడం లేదు. పొరపాటున ఎవరైనా వాటిని తొక్కితే ప్రాణనష్టం సంభవించే అవకాశాలు ఉన్నాయి. అలాగే వైటీసీలోని ఒక గదిలోకి ఆదివారం పాము వెళ్లడంతో అక్కడ ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలని, రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సినిమాలు

శ్యామల	వేట్టయన్
సూర్యమినీ	జిగ్రా
సూర్యప్యాలెస్	దేవర
శివజ్యోతి	విశ్వం
అనుశ్రీ	జనక అయితే గనక
స్వామి	శ్వాగ్
అశోక	విశ్వం
రాజా	మార్టిన్
రంభ	మానాన్న సూపర్‌హీరో
ఊర్వశి	వేట్టయన్
మేనక	సత్యం సుందరం, మార్టిన్
కుమారి	దేవర
అప్సర	దేవర



నామవరం

వీఎస్.మహల్	వేట్టయన్,దేవర

ధవళేశ్వరం

మురళీకృష్ణ	దేవర

కడియం

వెంకటసూర్య	వేట్టయన్

స్కేటింగ్‌లో సత్తా చాటిన క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ప్రకాశం నగర్: రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో వీవర్స్ కాలనీ స్కేటింగ్ పార్కుకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఇన్‌లైన్ బాలికల విభాగంలో నలుగురు, బాలుర విభాగంలో నలుగురు, క్వాడ్ బాలికల విభాగంలో ఎనిమిది మంది, బాలుర విభాగంలో నలుగురు పతకాలు సాధించారు.ఈ మేరకు సోమవారం స్థానిక నాగేశ్వరరావు పార్కులో విజేతలను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభినందించారు. భవిష్యత్తులో క్రీడాకారులు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

లక్కు తగిలితే కిక్కే..



దరఖాస్తుదారుడిని తనిఖీ చేసి లోపలకు పంపుతున్న పోలీసులు



ఆనం కళాకేంద్రం ఆవరణలో వేచిఉన్న దరఖాస్తులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలోని 125 మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి సోమవారం స్థానిక ఆనం కళాకేంద్రంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా షాపుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారందరూ తరలివచ్చారు. తమ అదృష్టం కోసం ఆసక్తిగా ఎదురు చూశారు. లాటరీలో పేరు తగిలిన వారు సంబరాలు చేసుకున్నారు. కాగా.. అందరూ భావించినట్టుగానే కూటమి నాయకులకే ఎక్కువ షాపులు దక్కాయి. బయట వారికి వచ్చిన షాపులకు సంబంధించి వాటాల మాటలు కూడా జరిగిపోయాయి.



ఆనం కళాకేంద్రం లోపల దరఖాస్తుదారులు



లాటరీ ప్రక్రియకు వచ్చిన వారి కార్లు

కరాటేలో పతకాల పంట

- రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు
- పలు విభాగాల్లో విజయ కేతనం



రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

ప్రకాశం నగర్: ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా మరి కొందరు, ఆసక్తితో ఇంకొందరు కరాటే నేర్చుకుంటున్నారు. నిరంతరం సాధన చేస్తూ మెలకువలు నేర్చుకుని ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తున్నారు. కరాటేలో నగర విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి, పలు పతకాలు సాధిస్తున్నారు. ప్రసుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కరాటే శిక్షణ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని, ఆపదలో ఆదుకునే విద్యగా ఉపయోగపడుతుందని పలువురు చెబుతున్నారు. అయితే మిగిలిన క్రీడలతో పోల్చితే దీనికి కఠోర శిక్షణ, ఏకగ్రత, క్రమశిక్షణ చాలా అవసరం.

పలు విభాగాల్లో పతకాలు

కాకినాడ పీఆర్ డిగ్రీ కాలేజీలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటి పలు విభాగాల్లో పతకాలు సాధించారు. కటస్ స్పెరింగ్ అండర్ 14,17,19 విభాగంలో బంగారం, వెండి, కాంస్య పతకాలు గెలుచుకున్నారు. బి.అక్షయ, బి.అంజలి, జె.నవ్యశ్రీ, జె.శశాంక్, ఏ.ప్రసన్న పూజిత, పి.పూజ, ఎండీ ఆయేషా, ఎస్.శ్రీలక్ష్మి లత, పి.చరణ్, ఎల్.వైష్ణవి బంగారు పతకాలు సాధించారు. జె.నక్షత్ర, ఏ.ప్రవీణ్, కె.జాక్వాస్ వెండి పతకాలు గెలుచుకున్నారు. వి.అజయ్ సంవీత్, పి.శ్రీరామ్ కాంస్య పతకాలను సాధించారు. ఈ క్రీడాకారులను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

గర్వకారణం



నా దగ్గర శిక్షణ తీసుకుంటున్న పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించడం ఎంతో గర్వకారణం. మిగిలిన క్రీడలతో పోల్చితే కరాటే ఎంతో క్లిష్టమైంది. ఓర్పుతో శిక్షణ తీసుకోవాలి. బాలురతో పాటు బాలికలు కూడా కరాటేలో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇది ఒక మంచి పరిణామం.

– పిల్లి అరుణ్ కుమార్, కరాటే మాస్టార్